# "మధురవాణితో పరిచయం"

రచన :
... వీరమల్లు రామకృష్ణ ...

దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధ సినిమా తారలందరిలోకీ చిన్నతార మధురవాణి. ఈమె చలనచిత్రరంగంలో రెండు కాళ్ళూ పెట్టి రెండేళ్ళు గడిచినయ్. ఈ కొద్దికాలంలోనూ ఈమె చాలా మంచిపేరే సంపాదించింది. ఈ సినిమారంగంలో సుమారు పదేళ్ల నుంచీ ఎక్స్ట్రాలుగా పనిచేస్తున్న వాళ్లుకూడా మెతుస్థాయి నందుకోలేకపోయారు. దీనికి కారణం ఆమె అందమే కానీయండి, నటనా సామర్థ్యమే కానీండి. మొత్తానికి మంచి అభివృద్ధినే సాధించింది.

ఈమె నటించిన చిత్రాలు మొత్తం ఐదు. ఇందులో రెండుచిత్రాలు యింకా సెన్సారు బోర్డు కత్తిరింపుల్లో వున్నయ్. విడుదలయిన మూడు చిత్రాల్లో రెండు ఫెయిల్యూర్. పోతే మిగిలిన ఒకటి చావుతప్పి కన్నులొట్టపోయి బాక్సాఫీస్ హిట్ అయి వూరుకుంది.

ఈ చిత్రాన్ని గురించి పత్రికలు విమర్శ వ్రాస్తూ, 'ఈ చిత్రంలో మధురవాణి నిర్వహించినపాత్ర అద్వితీయం, అపూర్వం. చిత్రమునకు వెన్నెముకలాంటి పాత్ర-అత్యంతకష్టమైనది. అద్భుతంగా నటించిన ఈమె భవిష్యత్తులో అభివృద్ధికి రాదగినతార' అని దినపత్రికల్లగాయితు త్రైమాసపత్రికలవరకు ఏకగ్రీవంగా వ్రాసినయ్.

ఈ విమర్శలన్నీ చదువుకునేసరికి తారకు అంతకుపూర్వంకంటె పైకి-యింకా పైకి—పోయిపోయి ఆకాశంలో నేపోయాననుకుంది. ఈదెబ్బతో యింకా క్రొత్త 'ఆఫర్సు' చాలా వస్తాయనుకుంది. దీనికితోడు సబ్బుల కంపెనీలు, హేరాయిల్ కంపెనీలు క్యాలెండరు కంపెనీలు, ఇన్సూరెన్సు కంపెనీల ఏజెంట్లు, బట్టలషాపులవాళ్ళు ఇంటిచుట్టూ మూగడం, 'ఫిలిం ఫాన్సు', 'పర్సనల్ లెటర్సు' వ్రాయడం, మరికొందరు సరాసరి యింటికే రావడం ఇదంతా చూసేసరికి తార ఉబ్బితబ్బిబ్బైంది.

అందరికీ వివరంగా, అడిగినవాళ్ళకు అడిగినట్లు లేదనకుండా సంతృప్తిపరచి పంపింది.

జీవితం హాయిగావుంది. 'రోల్సురాయిస్' కారు, పిలిస్తే పలికేనౌకరు, రమ్మంటే వచ్చే భర్తా, దేశంలో కీర్తి, తనింట్లో ఐశ్వర్యం. ఇంకేంకావాలి జీవితానికి? క్రొత్త అగ్రిమెంట్సుమీద సంతకాలు లేదనకుండా పెట్టేస్తుంది. 'ఇందువల్ల కీర్తి, డబ్బు వస్తుందిగానీ, క్షణంతీరికలేకుండపోతోంది' అంటుంది తార.

ఈవేళమాత్రం కాస్తంత విశ్రాంతిగా పడుకుని నవల చదువుకుంటోంది. అప్పటికి సమయం మధ్యాహ్నం రెండుగంటలు. బయట వైశాఖమాసపు ఎండ. చాలా తీక్షణంగా వుంది. మేడమీది పైభాగంలో ఓ గదిలో వుంది తార. ఆ భవనానికి చుట్టూవున్న ద్వారాలన్నిటికీ వట్టివేళ్ళ చాపలు కట్టబడి వున్నయ్. ప్రతి అరగంటకు ఓసారి నీళ్ళతో ఆ చాపలన్నీ తడుపుకుంటూపోతాడునౌకరు. తార గదిలో ఫాన్ వేసుకుని మంచంమీదపడుకుని నవల చదువుకుంటోంది. సరిగ్గా ఈ సమయాన నౌకరు గదిగుమ్మంలోనిల్చొని 'అమ్మా మీకోసం ఎవరో వచ్చారు' అన్నాడు.

'ఎవరో కనుక్కో' అంది తార అలాగే పడుకొని.

నౌకరువెళ్ళి కనుక్కొని తిరిగి వచ్చాడు. కాగితంముక్కమీద కలంతో అప్పటికప్పుడు వ్రాసిపంపాడు ఆ వచ్చినాయన. అది తెచ్చి తారకు అందించాడు నౌకరు. ఆ చీటీమీద ఇలావుంది : 'ఫలానా పత్రిక విలేఖరి సందర్శనార్థం' తార ఎందుకో సందేహించి, క్షణంలో తేరుకుని, 'సరే! ఆ గదిలోకి రమ్మను' అని చెప్పింది నౌకరుతో.

తార వెంటనేలేచి ప్రక్కగదిలోవున్న సోఫాలో కూచుని నవల పేజీలు త్రిప్పసాగింది. గదిగుమ్మంలోంచి గదిలోవున్న తారను చూసి 'నమస్కారం' అన్నాడు విలేఖరి.

'నమస్కారం, రండి, అలా కూచోండి' అని తనకు ఎదురుగావున్న మరో సోఫాను చూపింది తార.

విలేఖరి నవ్వుతూ ఆమెకు ఎదురుగా కూచున్నాడు. ఫాన్ గాలితోపాటు వట్టివేళ్ళ చాపలవాసన కలిసి చల్లగా వుంది. మొదట ఎయిర్‌కండిషన్ రూమేమో అనుకున్నాడు విలేఖరి. అంత చల్లగావుంది గది. ఎండలో నడిచినడిచి, ఒక్కసారి శీతలంలో పడేసరికి విలేఖరికి ప్రాణం దిమ్మరపోయినట్టయింది. మెడకు తగిలించుకున్న కెమెరా, చేతిలో లెదర్ బ్యాగ్ వగైరా తనమీది బరువంతా ప్రక్కనున్న సోఫామీదికి సర్ది కొంత స్థిమితపడి జేబురుమాలుతో చెమట తుడుచుకున్నాడు.

తార తన నౌకరునుపిలిచి పని పురమాయించింది 'ఓ రెండు ఐస్ కాఫీ' పట్టుకు రమ్మని.

లెదర్ బ్యాగ్‌లోంచి ఓ పెద్ద తెల్ల కాగితాలపుస్తకం, కలం తీసి డ్రాయరుమీద పెట్టాడు. ఆ బల్ల గుండ్రని ఆకారంలో నల్లగా అప్-టు-డేట్ మోడల్‌లో తారకు విలేఖరికీ మధ్యవుంది. విలేఖరి చెమట తుడుచుకుంటూ తార నుద్దేశించి, 'మిమ్మల్ని కలుసుకోగలిగినందుకు నాకు చాలా సంతోషంగా వుంది' అన్నాడు చిన్నగా నవ్వుతూ.

తార మౌనంగా నవ్వింది, నవల పేజీలు తిప్పుతూ.

'మిమ్మల్ని గురించీ, మీ నటనా సామర్థ్యాన్నిగురించి. మిమ్మలను ప్రశంసిస్తూ అనేకమంది మా పాఠకులు అనేక ప్రశ్నలు అనంతంగా అడుగుతున్నారు. వాటికి మేం తట్టుకోలేకపోతున్నాం. చూడండి, వైజాగ్ నుంచి పి. మురళీధరరావుగారు 'ఎడిటర్జీ' ప్రతినెల పరిచయం చేస్తున్నట్టు వచ్చే నెల శ్రీమతి మధురవాణినిగురించి పరిచయంచేస్తారని ఆశిస్తున్నాను' అని వ్రాశారు అంటూ

ఓ ఉత్తరం అందించాడు తారకి. ఆ ఉత్తరాన్ని అందుకుని చదివి తిరిగీ డ్రాయరుమీద పెట్టింది తార.

మరొకటి, మచిలీపట్నంనుంచి మాచేపల్లి శంకరనారాయణగారు 'మధురవాణికి వివాహమయిందా? కాలేదా? కాకపోతే ఆమె యింతవరకు ఎందుకు వివాహం చేసుకోలేదు' అని అడుగుతున్నారు అంటూ విలేఖరి మరో ఉత్తరం అందించాడు. అదికూడా అలాగే చదువుకుని తిరిగీ డ్రాయరుమీద పెట్టింది. ఇంతలో నౌకరు ట్రేలో రెండు కాఫీ పట్టుకొచ్చాడు.

కాఫీ కప్పు అందిస్తూ తీసుకోండి అంది తార విలేఖరితో.

విలేఖరి నవ్వుతూ కాఫీ అందుకుని రెండు గుక్కల్లో తాగేశాడు. అలవాటు ప్రకారం సిగరెట్టు ముట్టిస్తూ 'మీకేమయినా అభ్యంతరమా?' అని అడిగాడు తారను.

'లేదు' అంది తార.

సిగరెట్టు వెలిగించాడు విలేఖరి. మరొక ఉత్తరంతీసి, ఈ ఉత్తరం చూడండి, విజయవాడనుంచి పి. నళినీకాంతరావుగారు'మధురవాణిలో అంతా మధురమేనా? లేక హాలాహలంకూడా వుందా?' అని అడుగుతున్నారు అని ఆ ఉత్తరంకూడా అందించాడు తారకు. ఆ ఉత్తరం తీసుకుందికానీ, చదవకుండానే డ్రాయరుమీద పెట్టింది.

'ఇలాంటివే సవాలక్ష ఉత్తరాలు వొస్తున్నాయండీ. వాటన్నిటికీ లోగడ వీలైనంతవరకు మేమే సమాధానాలిచ్చాం. కానీ, మా పాఠకుల వొత్తిడిచూస్తే మిమ్మల్ని పరిచయం చేసేవరకూ ప్రాణాలు నిలిచేట్లులేవు' అన్నాడు విలేఖరి నవ్వుతూ సిగరెట్టు పొగ పైకి వొదుల్తూ.

'అయితే చాలా పెద్ద కార్యభారాన్నే పైన వేసుకున్నారన్నమాట' అన్నది తార.

'ఆ, ఇదో పెద్దభారమటండీ; ఈ వాల్టికోజున గగనపథంలో విహరిస్తున్న తారలందరికీ ఒకప్పుడు మేమే విపరీత 'పబ్లిసిటీ' యిచ్చాం. ఇప్పుడంటే వాళ్లు మా పత్రికలకు కనీసం తమ చిత్రం తాలూకు ప్రకటనసైనా యివ్వడం మానేశారుగానీ. అయినా కీర్తి, ఐశ్వర్యం ఎవరికైనా రావాల్సిందే కానీ, అంతమాత్రంచేత గతంలో తమను గౌరవించి సహాయంచేసినవాళ్ళను అంతలోనే మర్చిపోవడం కేవలం హాస్యాస్పదం అవుతుందిగానీ. కేవలం కళే ప్రధానాశయంతో పని చేసే మీకు ఏం లోటండీ' అన్నాడు విలేఖరి,

'అవునవును, ఆమాట అక్షరాలా నిజం' అన్నది తార.

'అయితే మా పాఠకులకు మిమ్మల్ని పరిచయంచేయడం గూర్చి మీ అభిప్రాయం?' అడిగాడు విలేఖరి.

'సరే' మీరంతగా అడుగుతున్నపుడు...

'ఓ, కే సహృదయులెప్పుడూ అలాగే వుంటారు' అన్నాడు విలేఖరి. సంతోషంతో తెల్లకాగితాల పుస్తకం ముందు పెట్టుకుని, కలంతీసి, మరొక సిగరెట్టు వెలిగించి, తారవేపు చూశాడు 'ఏంచెప్తారు' అన్నట్టు.

తార చెప్పడం మొదలెట్టింది. తన జన్మస్థానందగ్గరనుంచి ప్రస్తుత స్థానంవరకూ ఒక దశనుంచి మరొకదశకు మారుతూ, అదంతా ఓ పెద్ద సినిమాకథలా? ట్రాజడీయా? కామెడీయా? అనే సస్పెన్స్‌లో నడుపుతూ, చివరకు ట్రాజికల్ కామెడీగా పూర్తిచేసి వూరుకుంది తార.

విలేఖరికూడా రాస్తూరాస్తూ మధ్యమధ్య సందర్భాన్నిబట్టి, 'ఆఁ' 'అహ' 'ఓ' 'అరె' 'ఆఁ' 'అరెరె' 'అ' 'అహ' 'అదీ కథ' అంటూ ముగించేశాడు.

చివరకు గోడగడియారం మూడుగంటలు కొట్టింది. వ్రాసిందంతా తారచూసి ఇదంతా ఉన్నదున్నట్టు అచ్చువేస్తారా?'అని అడిగింది.

'అహ, అక్షరక్షరం కంపోజ్ చేయవల్సిందే' అన్నాడు విలేఖరి.

'ఆఁ అదేమిటీ అలాగయితే ఇంకేమన్నా వుందా?' భయంగా అడిగింది తార.

'ఓ, అదా మీ భయం. మరేం ఫర్వాలేదు. ఆ 'ఫిల్టర్' విషయం నేను చూసుకుంటాగా!' అన్నాడు విలేఖరి.

అంతలో తారకు 'కాల్' వచ్చింది. లేచి వెళ్ళి రిసీవర్ అందుకుని, 'అహ, సరేలెండి' అని రిసీవర్ పెట్టేసి తిరిగివచ్చి యథాప్రకారం కూచుంది, 'విధవ పనులు, క్షణం తీరికవుండదు' అని తనలో తాననుకుంది. అది విని విలేఖరి అడిగాడు 'మిమ్మల్ని ఎవరో కష్టపెట్టారే!' అని.

'ఆ, ఇంకెవరున్నారు. మావారికీ తీరిక లేదట. భోజనం హోటల్లో చేసారట. రాత్రి పదవుతుందట యింటికొచ్చేసరికి' అంది తార.

'అన్నట్టు, క్లబ్ వార్షికోత్సవాలు కదూ? మీకు మెంబర్‌షిప్ లేదా ఏమిటి?' ఆశ్చర్యంగా అడిగాడు విలేఖరి.

'అలాంటివి నాకు నచ్చవండీ! చాలమంది అడిగారుగానీ, నే ఒప్పుకోలేదు' అంది తార. అదికూడా నోట్ చేసుకున్నాడు విలేఖరి ఎందుకైనా పనికొస్తుందని.

'మరి మీ తాలూకు ఫోటోలేమైనా...' అడిగాడు విలేఖరి.

'ఇదివరకు తీసినవేమయినా పనికొస్తాయాండీ?' అడిగింది తార.

'అబ్బే, అదేం పనికిరావు. మళ్ళీ తీయవలసిందే!' అన్నాడు విలేఖరి కెమెరా కేస్‌లోంచి తీస్తూ.

'ఉండండి. అయిదునిమిషాల్లో టాయిలెట్ చేసుకుని వస్తాను' అని అవతలగదిలోకి వెళ్ళింది తార.

అంతవరకూ విలేఖరివ్రాసిన కాగితాలు సర్దుకుంటూ, సిగరెట్టు వెలిగించి కెమెరా లోడ్ చేస్తూ కూచున్నాడు. అప్పటికి గోడగడియారం నాలుగుగంటలు కొట్టింది.

గంటతరువాత డ్రస్సింగ్ రూమ్‌లోంచి బయటపడింది తార. విలేఖరి కళ్ళు జిగేల్‌మన్నయ్. వెంటనేలేచి కెమెరా తీసుకుని 'వుండండి, వుండండి' అని అరిచాడు. ఆకేకలకు భయపడి అలాగే నిల్చుంది తార. వెంటనే కెమెరా క్లిక్‌మనిపించాడు: విలేఖరి నవ్వుతూ 'గుడ్ షాట్' అన్నాడు. తారకూడ నవ్వుతూ 'మొదట భయపడ్డాను. అలా అరిచారేం' అంది.

'ఓహో, ఏం సౌందర్యం. ఏం అలంకరణ ఓహోహో' అన్నాడు విలేఖరి. తెల్లకాగితాల

పుస్తకంలో సీరియల్ నంబర్లు వేస్తూ నంబర్ వన్ 'అలంకరణ' అంటూ వ్రాశాడు.

తార సోఫాలో కూచుంది. కానీ ఆమెను అక్కడ కూచోనివ్వలేదు. 'అక్కడ కాదు, ఇక్కడ కుర్చీలో కూచుని రేడియో ట్యూన్ చేస్తూ కూచోండి' అన్నాడు.

తార అలాగే చేసింది

'మొహం నావేపు తిప్పండి' అన్నాడు విలేఖరి.

తిప్పింది.

'కొంచెంగా నవ్వండి.'

నవ్వింది.

కెమెరా క్లిక్‌మన్నది.

'వెరీగుడ్' అన్నాడు విలేఖరి.

పుస్తకంలో యిలా వ్రాశాడు: నంబర్ (టు) 'విజయవాడ రేడియో కేంద్రం ట్యూన్ చేస్తుంది.

'ఆఁ ఇలారండి దివాసీమీద కూచోండి' అంటూ ఆ గదిలోని సోఫాలూ, బల్లలూ తన యిష్టంవచ్చినట్టు మార్చేస్తున్నాడు. ఆమె అభ్యంతరం చెప్పగంలేదు.

'ఆఁ మీరు వీణ వాయిస్తారుగదూ?' ప్రశ్నించాడు విలేఖరి.

'ఆ! రెండేళ్ళక్రితం.'

'ఫరవాలేదులెండి' అంటూ ఆ గదిలో ఓ మూలవున్న వీణ తీసుకొచ్చి ఆమె ముందు పెట్టి దుమ్ము దులిపాడు.

'మీరు నావేపు చూడకుండా వీణవేపు చూస్తూ కుడిచెయ్యి తీగెలమీద వేసివుంచండి' అన్నాడు విలేఖరి.

ఆమె అలాగే చేసింది.

'కుడికాలు వెనక్కు... యింకొంచెం... ఆఁ' అన్నాడు విలేఖరి. కెమెరా క్లిక్‌మన్నది. (త్రి). 'ఆమెకు వీణావాయిద్యం అంటే అమితానురాగం. ప్రతిదినం అరగంట వాయిస్తుంది' అంటూ వ్రాశాడు.

'ఆఁ ఇలారండి. ఈ సోఫాలో పడుకుని ఒయ్యారంగా, ఈ పుస్తకం పట్టుకుని చూస్తూవుండండి' అని యింతకుపూర్వం తను వ్రాస్తున్న తెల్లకాగితాల పుస్తకమే ఆమెకూ యిచ్చాడు.

తార అలాగే చేసింది. కెమెరా క్లిక్ మన్నది. (ఫోర్) 'షూటింగ్‌కు వెళ్ళేముందు తన పార్టును శ్రద్ధగా చదువుతుంది' అంటూ వ్రాశాడు.

'ఇలారండి. కుర్చీలో కూచుని, ఇదిగో కలం, గడ్డానికి ఆనించి దేన్నిగురించో ఆలోచిస్తున్నట్టు కూచోండి' అన్నాడు.

ఆమె అలాగే చేసింది.

(ఫైవ్) ఉత్తరాలు వ్రాయడం వీరికి కాలక్షేపం. ప్రస్తుతం దేన్నిగురించో తీవ్రంగా ఆలోచిస్తున్నారు' అంటూ వ్రాశాడు.

'మీరు విప్పిన గుడ్డలు ఎక్కడ పడేస్తారు' అడిగాడు విలేఖరి.

'ఎందుకు?' ఆశ్చర్యంగా అడిగింది తార.

'చెప్తాగా.'

వెంటనే తార అంతకుపూర్వం తనువిప్పిన చీరే తీసుకొచ్చింది.

'స్నానాలగది ఎక్కడ?' అడిగాడు విలేఖరి.

'అదిగో అదే.'

ఆచీర తీసుకుని యిలారండి కుళాయ్ నీళ్ళు వొదలండి. వొంగుని చీర తడుపుతూ వెనక్కు. నావేపు చూడండి.' తార అలాగే చేసింది. కెమెరా క్లిక్ మన్నది.

(సిక్స్) కష్టపడి పనిచేయడం వీరికి సరదా' అంటూ పుస్తకంలో వ్రాశాడు.

ఈవిధంగా విలేఖరి తారను అనేక భంగిమల్లో నృత్యాన్నిగురించీ, కారు డ్రైవింగ్‌ను గురించీ మరి కొన్ని చిత్రాలు తీశాడు. అతీసిన వాటిల్లో ఎన్ని పనికొస్తాయో, ఎన్ని పనికిరావో ఆ తారకూ తెలియదు. అంతకంటే ఎక్కువ విలేఖరికీ తెలియదు. అందుకు మనమేమీ అనుకోనక్కరలేదు. ఎందుకంటే ఈ యిద్దరిలో ఏ ఒక్కరిదీ తప్పుకాదు.

కీర్తి కోసరం తార ఆపని చేస్తుంది.

పోతే విలేఖరి:

ఇతను ఉద్యోగంకోసరం, డిగ్రీ చేత్తో భిక్షాపాత్రలా పట్టుకుని, మహానగరంలో వీధివీధీ తిరిగీ, తిరిగీ తిండిలేక గుడ్డలేక నానా బాధలూ పడ్తూ చివరకు తిరిగేందుకూ కూడా ఓపికలేక స్పృహతప్పి ఓచోట పడిపోతే ఎవరో దయామూర్తి ఇతనిస్థితికి జాలిపడి ఆయన తనకు తోచినదారి చూపిస్తే, ఆ దారినే ప్రయాణించీ, ప్రయాణించీ ప్రస్తుతం విలేఖరిగా జీవితాన్ని గడుపుతున్నాడు. ఎప్పుడైనా ఆ దయామూర్తి కనుపిస్తే ఆయన పాదాలకు మనస్ఫూర్తిగా నమస్కరిస్తాడు. ఆ విశ్వాసం విలేఖరిలో పూర్తిగ వుంది.

తాందగ్గరకు తానువచ్చినపని జయప్రదంగా పూర్తయినందుకు విలేఖరికి చాలాసంతోషంగావుంది. కెమెరా మెడకు తగిలించుకుని సంచీ చేత్తోపట్టుకుని, 'ఇక సెలవు యిప్పిస్తారా' అంటూ ఆమెవేపు ఆశగా చూశాడు. తార గ్రహించింది. మౌనంగానవ్వి 'వుండండి ఐదునిమిషాలు' అంటూ గదిలోకివెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగివచ్చి యథాస్థానంలో కూచుని విలేఖరిచేతికి నాలుగువందల రూపాయల నోట్లను అందిస్తూ, 'ఇవి వుంచండి... తక్కినవిషయాలు తరువాత...

'చిన్న మాపు చూస్తున్నారు. వన్‌ఫోర్తు క్రౌన్‌సైజ్‌లో ఫారిన్ మెకానికల్ గ్లేజ్ పేపరుమీద ఫోర్టీన్‌పాయింట్ సెల్సన్‌టైప్‌లో గుడ్ గెటప్ యివ్వాలని నాఆశ. కానీ అంతప్లానుకు కనీసం ఖర్చులకూ కూడా-' అని నసిగాడు విలేఖరి.

'ఏమోనండీ, ఆ ఫోర్టీన్‌పాయింటు గ్లేజ్ పేపర్లూ నాకు సరిగ్గా తెలియవండీ. ప్రస్తుతం యింతకంటె ఎక్కువ కౌష్ లేదు. పోనీ మొత్తం 'చెక్కు' వ్రాయమంటారా?' అడిగింది తార.

'అబ్బెబ్బె... అలాగయితే ఈ ఇన్‌కమ్ టాక్సు, వెల్‌కమ్‌టాక్సు ఆఫీసర్లతో ప్రాణాలు పోతాయండీ' అంటూ ఆ నాలుగువందలు తీసుకుని 'మిగతదానికి మళ్ళీ ఎప్పుడుకన్పించమంటారు?' అని అడిగాడు విలేఖరి.

'ఎల్లుండిసాయంకాలం ఆరున్నరకురండి' అని చెప్పింది.

'ఓ అలాగే. వెళ్ళొస్తానండీ నమస్కారం' అన్నాడు విలేఖరి.

'నమస్కారం, తప్పక వస్తారుకదూ?' అంది తార వీడ్కోలిస్తూ. విలేఖరి సంతోషంతో మేడమెట్లు గబగబా దిగిపోయాడు.

జూన్‌నెల ఒకటో తేదీ 'ఫలానా' సంచిక ముచ్చటైన మూడురంగుల్లో 'మధురవాణి' ముఖచిత్రంతో వెలువడింది. 'ఈ నెల మా పాఠకులకు పరిచయం శ్రీమతి మధురవాణి' అని ప్రారంభిస్తూ ఆ పత్రిక ఆమెకోసరం పది పేజీలు ప్రత్యేకించింది.